www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 సెప్టెంబర్ 2024

టాస్క్ ఫోర్స్ డీఎస్పీగా మురళీధర్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ (ఆర్ఎస్ఏ ఎస్టీఎఫ్) డీఎస్పీగా మురళీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలోనూ టాస్క్‌ఫోర్స్‌లో డీఎస్పీగా పని చేసి ఫిబ్రవరిలో ప్రొద్దుటూరు డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే మరోసారి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా విధులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బందితో డీఎస్పీ మురళీధర్ సమావేశాన్ని నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ కు మరోసారి రావడం పట్ల అధికారులు, సిబ్బంది మురళీధర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఏచూరి దిక్సూచి

సంస్మరణ సభలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

అంజయ్య

దామోదరం



కేవి చౌదరి

కందారపు మురళి

పి.మురళి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ప్రస్తుత మతోన్మాద పరిస్థితులలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు సీతారాం ఏచూరి దిక్సూచి లాంటి వారిని పలువురు వ్యక్తులు ఉద్ఘటించారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నం పెంచలయ్య, పలువురు ప్రజానాట్యమండలి నాయకులు సీతారాం ఏచూరిని స్మరిస్తూ గీతాలాపనలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు మాట్లాడుతూ చదవడం ద్వారా పోరాటపటిమను పొంది, దానిని ఆచరణలో చూపించిన ఘనత ఏచూరిది అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను ప్రభావితం చేసిన వ్యక్తి ఆయనని కొనియాడారు. తెలుగువాడైన ఏచూరి ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకుడుగా, జేఎన్‌యులో ఆదర్శ విద్యార్థిగా ఎదిగి, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీని మరింత బలోపేతం చేశారన్నారు. నిస్వార్థ రాజకీయాలకు అంకితమైన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. ఆయనను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. టీటీడీ మాజీ చైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నిజాయితీ నిబద్ధత ప్రస్తుత రాజకీయాల్లో కనపడేది కేవలం కమ్యూనిస్టుల్లో మాత్రమే అన్నారు. ప్రస్తుత మత భావాజాలం దేశ రాజకీయాలను చిదిమి వేశాయని, మతోన్మాదశక్తులు పెట్రేగి దేశాన్ని కబలిస్తున్నాయన్నారు. మేధావులు సైతం అక్షరాన్ని బయట పెట్టేందుకు భయపడుతున్నారని, అందరివి మూగరోదనలగానే మిగులుతున్నాయని అన్నారు. ఇలాంటి తరుణంలో ప్రత్యామ్నాయ శక్తులన్నీ ఏకతాటిపై నడుపున ఘనత ఏచూరిదని కొనియాడారు. ఆయనని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, లౌకికవాద రాజ్యాన్ని నిలిపేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పార్టీలు బలహీన పడవచ్చు పార్టీ భావజాలం మాత్రం ఎప్పుడు బలంగానే ఉంటుందన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, ఆ భావాజాలాన్ని సమాజంలోకి చేర వేసి, యువతను ఆ దిశగా నడిపించడంలో సీతారాం ఏచూరి నిరంతరం కృషి చేశాడన్నారు. భారతీయ సమాజం లౌకికవాదం సామాజిక స్పృహ, తోటి వారు పట్ల ప్రేమను ఇంకా కోల్పోలేదని, పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఏచూరికి నివాళు లర్పించేందుకు వచ్చిన జనమే ఎందుకు నిదర్శనమన్నారు. స్విమ్స్ మాజీ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆసియాలను స్ఫూర్తిగా తీసుకొని, భవిష్యత్ తరాలు కూడా గుర్తుంచుకునే విధంగా రాబోవు రోజుల్లో పోరాటస్ఫూర్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్రకోశాధికారి కెవి.చౌదరి మాట్లాడుతూ వామపక్ష సిద్ధాంతాలను తాను ఎప్పుడూ గౌరవిస్తానని, కమ్యూనిస్టులకు సానుభూతిపరుడుగా ఉంటున్నానని, వారి పోరాటాలకు తాను సంపూర్ణ మద్దతు ఎప్పుడు తెలియజేస్తానని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రతి ఒక్కరిని కలుపుకొని తత్వం, లౌక్యంగా వ్యవహరించడం ఆయనకు అదనపు ప్రతిభ అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశనుండే వేలాదిమంది కార్యకర్తల్లో స్ఫూర్తిని నింపి, పోరాటాల వైపు నడిపారన్నారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆర్.పి.ఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ ఆదివాసులు దళితులు కమ్యూనిస్టులు కలిసి పోరాడితేనే లౌకికవాద సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయగలమని నమ్మి, ఆ దిశగా నినాదించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని తెలిపారు. నీల్ లాల్ కలిసి పనిచేయాలని, నేటి యువత ఆయనని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో టి.సుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, అంగేరి పుల్లయ్య, జనార్ధన్, మల్లారపు నాగార్జున్, సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద రోజుల్లో

వందకు పైగా అభివృద్ధి పనులు

బియ్యపు మధుకు ఆరు నెలల్లో జైలు : ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో వందకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అవినీతిపై సిబిఐ, ఈడీ, ఐటీ శాఖల ద్వారా విచారణ జరిపి ఆరు నెలల్లోగా జైలుకు పంపుతానని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఊరందూరులోని తన స్వగృహంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రూ.10 కోట్లతో వివిధ దశల్లో పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయంలో రోజుకు 25వేల రాహు- కేతు సర్పదోష నివారణ పూజలు జరిగేలా చేయడమే తన లక్ష్యమన్నారు. ముక్కంటి ఆలయంలో త్వరలోనే మాస్టర్ ప్లాన్ పనులు ప్రారంభిస్తామన్నారు. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మానసిక పుత్రిక అయిన స్కిట్ కళాశాలను ఆరు నెలల్లో జేఎన్టీయూ విలీనం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో మున్సిపాలిటీకి రూ.50లక్షలు మంజూరు చేయించి, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు చేసి వరద ముప్పు లేకుండా చేశామన్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత నివారణకు బోర్లు వేయించామన్నారు. అంధకారంలో ఉన్న గ్రామాల్లో వీధిలైట్లు వేయించామన్నారు. ప్రతి పంచాయతీలో శానిటేషన్ ప్రతినిత్యం చేస్తూ వాటి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

పర్యవేక్షణకు వినూత్నగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో పెనుమార్పులు తెచ్చామన్నారు. మాడ వీధుల్లో రాజకీయ బ్యానర్లు నిషేధించామన్నారు. ఆలయ ఆదాయాన్ని వందరోజుల్లో రూ.4కోట్లు వచ్చేలా చేశామన్నారు. గ్రామాల్లో సైతం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఆలయ మాస్టర్‌ప్లాన్‌కు అడ్డంకులు తొలగించి పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తిలో మట్కా, బెట్టింగులు, గంజాయి వంటి అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. త్వరలోనే అక్రమాలకు పాల్పడే వారిని అరెస్టు చేయిస్తామని స్పష్టం చేశారు.

సిఎం సహాయ నిధికి రూ.57 లక్షలు : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విజయవాడ తదితర ప్రాంతాలు వరదలతో అతలాకుతలం అయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేసి అందించిన ఆపన్న హస్తంకు తోడుగా తాము సైతం అని తిరుపతి జిల్లా యంత్రాంగం నుంచి వరద బాధితులకు పలు విధాలుగా సాయం అందించడానికి చర్యలు తీసుకున్నామని, పలువురు దాతల నుండి అందిన విరాళాల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.57,48,408లను జమ చేయనున్న నేపథ్యంలో మెగా చెక్కును జెసి శుభం బన్సల్‌తో కలిసి మీడియా సమక్షంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ విడుదల చేశారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రెండు వారాల క్రితం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, విజయవాడలో భారీ వర్షాల కారణంగా వరదల వలన పలు ప్రాంతాలు నీటమునిగి నష్టపోయిన బాధితులను ఆదుకోవటానికి అవిశ్రాంతంగా 10 రోజుల పైగా మన ముఖ్యమంత్రి కృషిచేసి అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ఆపన్న హస్తం అందించారని తెలిపారు. జిల్లాలో మొట్టమొదటగా తన నెల జీతంలో సగభాగం విరాళంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందచేశానని కలెక్టర్ తెలిపారు. అలాగే దాతలు ముందుకు వచ్చి వరద బాధితులకు అండగా నిలవాలని తాను ఇచ్చిన పిలుపు మేరకు దాని స్ఫూర్తితో జిల్లాలోని ఆల్ ఇండియా సర్వీస్ అధికారులు, పలు శాఖల ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు పలువురు స్వచ్ఛందంగా వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు సుమారు రూ. 84,50,193లను ఇప్పటి వరకు అందచేశారని తెలిపారు. అందులో ఇప్పటికే జిల్లా యంత్రాంగం దాతల నుండి అందిన విరాళాలలో సుమారు రూ.24,30,500 ల విలువైన వాటర్ బాటిల్స్, పాల టెట్రా ప్యాకెట్లు, బిస్కట్ ప్యాకెట్లు,అగ్గి పెట్టెలు, కొవ్వొత్తులు బ్రాండెడ్ వస్తువులను వరద బాధితుల సహాయార్థం విజయవాడకి పంపడం జరిగిందనీ తెలిపారు. మన జిల్లాలో తిరుపతి, చిత్తూరు నారాయణ విద్యాసంస్థల పాఠశాలల మరియు కళాశాలల విద్యార్థిని విద్యార్థులు రూ.27,01,760లను విరాళంగా అందజేయడం జరిగిందని, అకార్డ్, సాకేత్, ఎడిఫై తదితర విద్యాసంస్థలు, విద్యార్థులు, పంచాయతీరాజ్, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, విశ్రాంత ఉద్యోగులు పలువురు అధికారులు, పలు పరిశ్రమలు శ్రీ సిటీ, శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ కంపెనీ, అపోలో టైర్స్ తదితరులు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందజేశారని, దాతలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని కలెక్టర్ అన్నారు. అలాగే తిరుపతి జిల్లా నుండి పలు శాఖల విభాగాల ద్వారా రెవెన్యూ, మునిసిపాలిటీ, పంచాయితీ తదితర శాఖల నుండి పలువురు అధికారులు, సిబ్బంది విజయవాడ వరదముంపు ప్రాంతాలలో సహాయకచర్యలలో, ఎన్యుమరేషన్‌లో భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబందాలశాఖ అధికారి బాల కొండయ్య, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ తనిఖీలు

రూ.7లక్షలకు పైగా జరిమానాలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి నగరంలోని పలుప్రాంతాల్లో కమిషనర్ నగరపాలక సంస్థ సిబ్బందితో కలసి దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు కలిగిన దుకాణదారులకు సుమారు రూ.7లక్షలకు పైగా భారీ జరిమానాలు విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు నగరంలో దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. మేజర్ గా ఉన్న మూడు హోల్‌సేల్ దుకాణాల్లో ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని, భారీగా జరిమానాలు విధించడం జరిగిందన్నారు. హోల్‌సేల్ దుకాణాల నుండి తెచ్చి చిన్నచిన్న దుకాణంలో విక్రయిస్తున్నారని అన్నారు. అందువల్ల హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహించి వారికి వద్ద నుండి అమ్మకాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, తదితర ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ప్లేట్స్, స్పూన్స్, ప్యాకింగ్ కవర్స్, అమ్మితే దుకాణల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. బయో డిగ్రేడబుల్ కవర్లు అమ్మాలని దుకాణదారులకు సూచించారు. అధిక మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు అమ్మే దుకాణలపై లక్షల్లో జరిమానా విధిచినట్లు తెలిపారు. ఒక దుకాణానికి రూ.2.90లక్షల భారీ జరిమాన విధించామని అన్నారు. అలాగే నగరంలోని పలు దుకాణాలకు జరిమానాలు విధించామన్నారు. ప్రజలు కూడా పేపర్ కవర్స్, జ్యూట్ బ్యాగ్స్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతినీ తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

సీఎం సహాయ నిధికి లక్ష సాయం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ప్రముఖ శ్రీసిటీకి చెందిన శ్రీనివాస కన్ స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాస్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి అందజేసి వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరదల్లో ఎవరు ఊహించనంత నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాటి మనిషిగా, మానవత్వంతో వరద బాధితులకు అండగా నిలబడుతున్న దాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విజయవాడ పూర్తిగా కోలుకునే వరకు దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, గోపీనాథ్, గుత్తా విజయ్, నింగ్ర సుధాకర్ పాల్గొన్నారు.

'స్వాహా సొమ్ము 25వ తేదీ రికవరీ చేయిస్తాం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చియ్యవరం పంచాయతీ పరిధిలో డ్వాక్రా మహిళా సంఘాల్లో దుర్వినియోగం జరిగిన రూ.1.89 కోట్లను ఈనెల 25వ తేదీ రికవరీ చేస్తామని ఏపీఎం గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. చియ్యవరం పంచాయతీ పరిధిలో వెలుగు మహిళా సంఘాల సొమ్ము దుర్వినియోగం చేసిన సంఘమిత్రలపై చర్యలు కూడా తీసుకున్నామన్నారు. దుర్వినియోగం చేసిన సొమ్మును ఈనెల 25వ తేదీ చెల్లించే విధంగా గ్రామ కమిటీ తీర్మానం చేసిందన్నారు. ఈ నిధుల దుర్వినియోగం ఉన్నతాధికారులు కూడా త్వరలో విచారణ చేస్తారని ఏపీఎం గురుమూర్తి తెలిపారు.

చరణ్ రాయల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామంలో బుధవారం జనసేన నాయకుడు చరణ్ రాయల్‌ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరో గుర్తు తెలీని వ్యక్తులు మంగళవారం చరణ్ రాయల్ ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో తీవ్రగాయాలతో హాస్పిటల్లో అడ్మిట్ అయ్యారని తెలిపారు. ఈ అంశం తన దృష్టికి రావడంతో వెంటనే చరణ్‌కి న్యాయం చేయాలని గాయపడిన వారి ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు, అలిపిరి ఎస్సైతో దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వాళ్లకు తగిన గుణపాఠం చెప్పాలని వాళ్ళకి శిక్షపడేలా చేయాలని ఆదేశాలు ఇచ్చామని, చరణ్ త్వరగా కోలుకోవాలని మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట శెట్టిపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు మెంబర్ ముని వేణి, ముని శంకర్, మనోజ్ కుమార్, గోపి, ప్రభాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రోటోకాల్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లు, వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీస్, ఎయిర్పోర్ట్, టెంపుల్ తదితర సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, జెసి శుభం బన్సల్, ఎస్పి సుబ్బరాయుడుతో కలిసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ప్రముఖ విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలు తదితరాలు కలిగి ఉందని, పలు జాతీయ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు జరుగుతుంటాయని, పై తెలిపిన వివరాల నేపథ్యంలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జడ్జీలు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు తదితర ప్రముఖుల పర్యటనలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రోటోకాల్ ఏర్పాట్లు పక్కాగా ఉండాల్సి ఉంటుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలకు, వివాదాలకు తావు లేకుండా అప్రమత్తంగా పనితీరు ఉండాలని సూచించారు. విమానాశ్రయ అధికారులు తగినన్ని పాస్‌లు కలెక్టరేట్ నుండి తెలిపిన వివరాల మేరకు తప్పకుండా సకాలంలో ఇవ్వాలని, సిఐఎస్ఎఫ్ అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తిరుమల శ్రీవారి టెంపుల్, తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం తదితర దేవాలయాలలో ప్రముఖుల పర్యటనల్లో వారి కేడర్ ఆధారంగా సరియైన ప్రోటోకాల్ అమలు చేసి వారికి సరియైన రిసెప్షన్, వసతి, దర్శనం ఏర్పాట్లు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రెవెన్యూ, టెంపుల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ భద్రత చర్యలు ప్రోటోకాల్ స్కేల్ మేరకు ప్రముఖులకు ఏర్పాట్లు ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ వారు ప్రముఖుల పర్యటనల సమయంలో మార్గదర్శకాల మేరకు అంబులెన్స్, డాక్టర్లను ఏర్పాటు ఉండాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రముఖులకు భద్రత స్కేల్ ప్రకారం సెక్యూరిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి వసతి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ పలు అంశాలు అధికారులకు వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, ఆర్డీఓ తిరుపతి నిశాంత్ రెడ్డి, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవి శంకర్ రెడ్డి, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, టీటీడీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పోలీస్ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై 'రీ వెరిఫికేషన్'

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫ్రీ హోల్డ్ భూములపై రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు తహశీల్దార్ మధుసూదన్ రావు తెలిపారు. స్థానిక తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బుధవారం ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ పై సర్వేయర్లు, వీఆర్వోలకు అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. మండల పరిధిలోని 27 పంచాయతీల్లో 1557 మంది రైతులకు చెందిన 1873.19 ఎకరాల భూమిపై గతంలో ఫ్రీ హోల్డ్ సర్వే జరిగిందన్నారు. అయితే ఫ్రీ హోల్డ్ సర్వేలో పొరపాట్లు దొర్లినట్లు ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రీ వెరిఫికేషన్‌కు ఆదేశించిందని వివరించారు. ఆ మేరకు మండల వ్యాప్తంగా మంగళవారం నుంచే రీ వెరిఫికేషన్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. షెడ్యూల్ ప్రకారం సంబంధిత వీఆర్వో, సర్వేయర్ క్షేత్రస్థాయిలో వెళ్లి సదరు రైతులు ఫ్రీ హోల్డ్‌కు సంబంధించి ఎలాంటి ధృవపత్రాలు సమర్పించారో పరిశీలించాలని ఆదేశించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మన ఇంటితో పాటు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని పంచాయతీ కార్యదర్శి ఇందిర, పంచాయతీ ఉప సర్పంచ్ రాజా పేర్కొన్నారు. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగలో స్వచ్ఛతహి సేవాను నిర్వహించారు. అనంతరం మండలంలోని తెలుగు గంగ కార్యాలయం పక్కన కొన్ని రోజులుగా నిరుపయోగంగా వున్న మంచినీటి కుళాయికి మరమ్మతులు చేసి ఉపయోగం లోకి తీసుకువచ్చారు. పంచాయతీలోని అపరిశుభ్ర ప్రాంతాల్లో పరిశుభ్రం చేయడం, వీధులలో బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతిరోజూ పంచాయతీ సర్పంచి, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలోనూ రోజుకు ఒక గంట స్వచ్ఛభారత్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు వద్ద పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ సర్పంచ్

సీఎం సహాయనిధికి విరాళాలు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి చెందిన సాయి పదివేల రూపాయలు, చిల్లకూరు మండలం ఎగురు రాజుపాలెం గ్రామానికి చెందిన శివశంకర్ రాజు ఐదు వేల రూపాయలు సీఎం సహాయ నిధికి విరాళాలు అందించాలని కోరుతూ గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అతని ఇంటి వద్ద బుధవారం చెక్కులు అందించారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రెండవ విడత ఇప్పటి వరకు అందిన 8 లక్షల రూపాయల విరాళాలను విజయవాడలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు అందించేందుకు విజయవాడకు వెళుతున్నట్లు తెలిపారు . ఎవరైనా విరాళాలు అందించాలనుకుంటే నేరుగా సీఎం సహాయనిధి అకౌంట్‌కు పంపాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు.

ఎమ్మెల్యేకు చెక్కులు అందిస్తున్న దాతలు

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్ పేటలో నివసిస్తున్న ఆటో డ్రైవర్ మున్నా ఇటీవల అనారోగ్యానికి గురై, నడవలేని స్థితిలో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాడు. సాటి ఆటో కార్మికులు అందరూ కలిసి ఐదువేల రెండు వందల రూపాయలను మున్నాకి అందించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి మున్నాకి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివిరమణయ్య, గూడూరు రైల్వే స్టేషన్ సిఐటియు ఆటో స్టాండ్ నాయకులు ఎస్కే మున్నా, ఆర్ లక్ష్మణ్, ఆర్ రఘు, ఎస్ శేఖరయ్య, ఎస్కే హషీమ్, యం బాలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలోని 28వ వార్డు, ఎగువ వీరారెడ్డి పల్లి ప్రాంతంలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రజలకు పారిశుధ్యం , పరిసరాల పరిశుభ్రత, అంటురోగాల నిర్మూలనపై అవగాహ కల్పించేందుకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ వార్డు మాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో, గాయం వెంకట రమణయ్య, 16వ సచివాలయం అడ్మిన్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలయ్య, వెల్ఫేర్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, స్థానిక టిడిపి మహిళా నేత పోబాక లక్ష్మి, టిడిపి స్థానిక నేతలు పూండ్ల శివయ్య, కోవూరు మురళి, పరిమళ శ్రీనివాసులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : స్వచ్ఛత హి సేవలో భాగంగా మున్సిపల్ శాఖ, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, చెట్ల పెంపకం, బహిరంగ ప్రాంతాల్లో మలవిసర్జన చేయకూడదని, కాలుష్య నివారణ వంటి ప్లే కార్డులతో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్త తొలగింపు సమయంలో వారు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? చేతులకు గ్లౌజులు, చెప్పులు, మాస్కులు వంటివి ధరించుకొని చెత్తను తొలగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మండలం పారవోలు గ్రామపంచాయతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని సర్పంచ్ నెల్లూరు సర్పంచ్ అమ్ములు ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ మమతా మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం గాంధీజీ కలగన్న స్వప్నం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ ఆంధ్ర కార్యక్రమాలతో పట్టణ గ్రామీణ ప్రాంతాల చెత్త మురుగునీరు తొలగించి పరిసరాల పరిశుభ్రత గా పాటించాలని ప్రజలందరూ ఆరోగ్యంగా గొప్ప వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వం ప్రత్యేకగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో సచివాలయ మహిళా సంరక్షణ అధికారి శాంతి, హెల్త్ వర్కర్ ఇందిర, అంగన్‌వాడీ వర్కర్ పార్వతి, ఆశ వర్కర్ భూదేవి, గ్రామస్తులు పిల్లలు పాల్గొన్నారు.

మామిడి చెట్లకు నీరు తప్పక అందించాలి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం : మండలంలో ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉండడంతో మామిడి చెట్లు తీవ్ర ఉష్ణోగ్రతను ఎదుర్కొంటున్నా యని మామిడి చెట్లకు డ్రిప్ ద్వారా నీరు తప్పక అందించాలని హార్టికల్చర్ ఆఫీసర్ శివకుమారి తెలిపారు. బుధవారం ఎలమంద పంచాయతీలో మామిడి తోటలను ఆమె పరిశీ లించి ప్రస్తుతం మామిడి చెట్లకు కొమ్మలు కత్తిరించి కాపర్ ఆక్సి క్లోరైడ్ పిచికారీ చేసి నీటిని అందించాలని రైతులకు సూచించారు. పంట సమయంలో తేనెమంచు పురుగు, గొంగళి పురుగు నివారించడానికి వేప నూనె లేక వేప కషాయంతో పాటు క్లోరో ఫైర్పాస్ కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

మామిడి చెట్లను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ శివకుమారి

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: చదువుతున్న తమ పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని చిన్నగొట్టిగల్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వృత్తి విద్యాధికారి విశ్వనాథ నాయక్ బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో పేర్కొన్నారు. పిల్లలను కళాశాలకు పంపడంతో సరిపెట్టుకోకుండా వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి కళాశాలలో హాజరు, మార్కులు అడిగి తెలుసుకొని అధ్యాపకులతో చర్చించాలని సూచించారు. మంచి అలవాట్లు, పద్ధతులను అనుసరించేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విశ్వనాథనాయక్

వీధిలో గాఢాంధకారం

- రెండు నెలలుగా వెలగని వీధి లైట్లు
- స్పందించని అధికారులు
- పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యుత్ దీపాల వెలుగుతో ప్రకాశించాల్సిన పట్టణం లో ఓ వీధిలో గాఢాంధకారం నెలకొంది. రెండు నెలలుగా ఈ దుస్థితి నెల కొనడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి ఓ మహిళ చీకట్లో తన పిల్లలను తీసుకుని ఇంటికి వెళుతుండగా పాము కాటుకు గురై మృతి చెందింది. పట్టణంలోని స్థానిక జెండా మాను ఎక్స్‌టెన్షన్ వీధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గత రెండు నెలలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో జెండా మాను ఎక్స్‌టెన్షన్ వీధిలో గాఢాంధకారం నెలకొంది. మంగళవారం సాయంత్రం పాలమంగళం సమీపంలోని చెర్లోపల్లికి చెందిన ధనంజేయులు భార్య రూప (39) తన పిల్లల్ని ట్యూషన్ నుంచి తీసుకుని వెళుతుండగా రాత్రి సమయంలో విషసర్పం కాటు వేసింది. ఆమెను మెరుగైన చికిత్స కోసం తిరుపతి ప్రైవేట్ హాస్పిటల్(నారాయణాద్రి)కి తరలిం చారు. ఆమె పరిస్థితి విషమించడంతో అక్కడ డాక్టర్లు చికిత్స అందించలేని చెప్పడంతో హుటా హుటిన అమర హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. వాస్తవానికి వారు తమ పిల్లల చదువు కోసం చెర్లోపల్లి నుండి పుత్తూరుకు కాపురం వచ్చారని, ఆమె భర్త ధనజేయులు టెక్స్ టైల్‌లో పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. జెండామాను వీధిలో కుక్కల బెడద ఎక్కువ ఉండడంతో ప్రతీ రోజూ సాయంత్రం ఆమె తన పిల్లలను ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకొచ్చేదని స్థానికులు తెలిపారు. పాము కాటుకు గురై రూప మృతి చెందడంతో అటు చెర్లోపల్లి, ఇటు జెండామాను వీధిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఇకనైనా మున్సిపల్ అధికారులు వీధి దీపాలు వెలిగే లా చర్యలు తీసుకున రాత్రి వేళల్లో విష సర్పాల బెడద నుండి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పాము కాటుతో మృతి చెందిన రూప (ఫైల్ ఫొటో)

మహిళను కాటు వేసిన పాము

సాగులో అధిక రసాయనాలతో అనర్థాలు

జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : సాగు భూములకు ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు, కలుపు మందులు అధిక వాడకం రైతులకు మేలు కంటే కీడు ఎక్కువగా వుంటుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. ఏర్పేడు మండలం బండారు పల్లెలో రైతులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రసాయనాల ఎక్కువ వాడకం వల్ల భూములు జీవాన్ని కోల్పోయి, నిస్సారమవుతు న్నాయని తెలిపారు. నిర్జీవమైన నేలకు ఎంత ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనం రాదని వివరిం చారు. పశువుల ఎరువు, పచ్చి రొట్టె వంటి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడకంలో నేలల్లో జీవాన్ని పెంచవచ్చునని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ నాగమణి చీడల నివారణ గురించి వివరించారు. పంటలకు అధికంగా యూరియా వాడకంలో చీడల బెడద పెరుగుతుందన్నారు. భూములకు అధికంగా కాంప్లెక్స్ ఎరువులు వాడడం వల్ల భాస్వరం నిలవలు పెరిగి మొక్కలకు జింకు అందదని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగకు ఉద్యాన సాగు అందిస్తున్న 64 వేల రూపాయల ప్రోత్సా హాన్ని వినియోగించు కోవాలని ఉద్యాన సాగు అధికారి పుష్పలత తెలిపారు. భూములు, భూగర్భ జలాల కాలుష్య నివారణకు రైతులు నానో ఎరువులను వాడాలని ఇఫ్‌కో క్షేత్ర అధికారి మణి చంద్ర తెలిపారు. రబీలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను ఏవో వేణుగోపాలరావు వివరించారు. భవిష్యత్తులో సాగుపై మరింత విజ్ఞానాన్ని అందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, మండల ఏవో షణ్ముగం, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ పాల్గొన్నారు.

రైతులకు సాగులో సలహాలు అందిస్తున్న జిల్లా ఏడీఏ భాస్కరయ్య

4న స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగర పాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎన్నిక అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్ మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియకు ఈ నెల 19వ తేదీ నోటీసు ప్రచురిస్తున్నామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎన్నికలలో పాల్గొనాలనుకున్న కార్పొరేటర్లు తమ నామినేషన్ ఫామ్ నెంబర్- 111 ని పూరించి ఈ నెల 19వ తేదీ నుండి ఈ నెల 26వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల లోపల కమిషనర్ కు అందించాలని తెలిపారు. అర్హత సాధించిన నామినేషన్లను 27 వ తేదీ ప్రకటిస్తామని, 30 వ తేదీ విత్ డ్రా ఉంటుందని, అదే రోజు పోటీలో ఉన్న వారికి పేర్లు ప్రకటిస్తామని తెలిపారు. పోటీలో ఉన్న వారికి అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహించి, విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. 22 వ తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడం వల్ల నామినేషన్లు స్వీకరించబోమని కమిషనర్ ఎన్ మౌర్య ప్రకటనలో పేర్కొన్నారు.

ఏసీఏ స్టేట్ ఇన్ ఫ్రా కమిటీ ఛైర్మన్‌గా క్రికెట్ విజయ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ స్టేట్ ఇన్ ఫ్రా కమిటీ ఛైర్మన్‌గా తిరుపతి విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) ఎంపికయ్యారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా క్రికెట్ విజయ్ మాట్లాడుతూ 71 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాధాన్యత కల్పించారన్నారు. క్రికెట్ పై ఆసక్తి కలిగి బీసీసీఐ, ఎన్సీఏ, లెవెల్ వన్ కోచ్‌గా క్రికెట్‌కి సేవలు అందించారన్నారు. క్రికెట్‌పై ఆసక్తి కలిగి ప్రతిభ ఉన్న ఏ ఒక్క క్రికెట్ క్రీడాకారుడికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కోర్టుల చుట్టూ 17 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి రెండు నెలల క్రితం విజయం సాధించామన్నారు. ఇన్నేళ్ల రాజకీయ అండ ఉన్నవారు మాత్రమే క్రికెట్‌లో అవకాశాలు పొందారని, నిజమైన క్రీడాకారులు వెనకపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్‌పై ఆసక్తి కలిగిన క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నామని తెలిపారు. అందులో భాగంగానే అంపైరింగ్ 100, కోచ్‌లు 50, స్కోరర్స్ 50, మేనేజర్లు 50 పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. అందుకు 18 సంవత్సరాలు నిండి 10వ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన వారు ఈనెల 29వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు గిరి ప్రకాష్ 9849058490, 9573378778 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు క్రికెట్ విజయను సత్కరించారు.

క్రికెట్ విజయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- రాజకీయ కక్ష సాధింపులు వద్దు..
- రెండవ రోజుకు స్వచ్ఛ భారత్ కార్మికుల రిలే దీక్ష

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం అప్పలరాజుకండ్రిగ లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు శ్రీనివాసులు, జ్యోతిలను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు అన్నాదొరై, సుభాష్ మాట్లాడుతూ మండలంలో స్వచ్ఛభారత్ కార్మికులు వంద మందికి పైగా పనిచేస్తున్నారని, వీరికి 30 నెలలుగా జీతాలు పెండింగ్‌లో వున్నాయని, 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదలైనా వీరికి జీతాలు మాత్రం ఇవ్వకుండా జీతాలు అడిగితే పనిలో నుంచి ఆపేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. వంద రోజులు గడుస్తున్న హామీలు కూడా అమలు కాలేదని కార్మికులకు జీతాలు అందలేదని జీతాలు అడిగితే మిమ్మల్ని పనిలో నుంచి ఆపేస్తామని ప్రభుత్వం మాది.. మా ఇష్టం వచ్చినట్లు మేము ఎవరినైనా పనిలో పెట్టుకుంటాం.. మా మాటకు తిరుగు లేదు..!' అని బెదిరింపు చర్యలకు పూనుకుంటున్నారని ఇది సరైంది కాదని అధికారులు కలెక్టర్, డిపిఓ స్పందించి పంచాయతీ కార్మికులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నాదురై, సుభాష్, ముని చంద్ర, ఆనంద్, జ్యోతి, శ్రీనివాసులు, రాజా, సరళ అంకమ్మక్క,పెద్ద గోవిందయ్య, వెంకటేష్, లోకయ్య, వీరాస్వామి, చిరంజీవి,లక్ష్మీపతి మండల స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలి

ప్రజాశక్తి -కోట : ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు మీజూరు మాధవ్ అన్నారు. బుధవారం కోట మండలంలోని సిద్ధార్థ(మీజూరు మాదవ్)కాంప్లెక్స్‌లో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ అధ్యక్షులు మీజూరు మాధవ్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటవ తేదీ ఇచ్చిన తీర్పు న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా లేదని, అలాంటి అక్రమ తీర్పును యావత్తు భారతదేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో మాలలకు న్యాయం జరిగే వరకు రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ తమ పోరాటాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు దాసరి సుందరం చేతుల మీదుగా కమిటీలో ఎంపికైన వారిని శాలువా తో సత్కరించి అభి నందనలు తెలి పారు. ఈ కార్యక్ర మంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక కమిటీ గౌరవాధ్యక్షులు దాసరి సుందరం, కమిటీ అధ్యక్షులు మీజూరు మాధవ్, ప్రధాన కార్యదర్శి బందిల రంగనాథ్, కార్యదర్శి పాల మల్లికార్జునరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పంటరంగం వసంత్, కోశాధికారి పిండి కేశవ్, లీగల్ అడ్వైజర్ దాసరి అశోక్ కాంబ్లే, ఉపాధ్యక్షులు పనబాక హేమంత్, డి ప్రతాప్, సంయుక్త కార్యదర్శులు దార్ల ఏడుకొండలు దారా బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు మాధవ్

క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలోని నెలబల్లి విలేజ్ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు వేగవంతంగా నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ప్రస్తుతం దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాంపునకు విశేషంగా ప్రజలు విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిం చుకున్నారు. కాగా, దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో ఈ నెల 20వ తేదీ కొత్తపల్లి, ఈ నెల 23వ తేదీ పోలిరెడ్డి పాళెం, 25వ తేదీ యెకొళ్లులో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విచైతన్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి హరిత, వైస్ ఎంపిపి దువ్వూరు గోపాల్ రెడ్డి, సర్పంచులు సన్నారెడ్డి రజని, రామయ్య, పంచాయతీ కార్యదర్శి ఎన్ శిఖామణి, మాజీ సర్పంచ్ గోను జకరయ్య, సిహెచ్ఓ సంపూర్ణమ్మ, హెల్త్ విజిటర్ మైథిలి, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంల్ హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పాత బస్టాండ్ సెంటర్లో మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు పుట్టినరోజు వేడుకలు ఆయన అనుచరులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గూడూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రావు మాట్లాడుతూ స్వతంత్రంగా ఆలోచించే వారికి వైసీపీలో స్థానం ఉండదని అందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. తనను ఆదరి స్తున్న బిజెపి నాయకత్వానికి , స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలుపు కుంటున్నా మన్నారు. గూడూరు నియోజవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పురుషోత్తం రెడ్డి , బాలకృష్ణ నాయుడు, ప్రకాష్ నాయుడు, వినీష్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు

పోస్టల్ ఉద్యోగులను వేధించడం సరికాదు: మురళి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పోస్టల్ ఉద్యోగులను అసాధారణ టార్గెట్లతో వేధించడం సరికాదని, దీనిపై పోస్టర్ ఉద్యోగులందరూ సమిష్టి పోరాటానికి సిద్ధమయ్యామని ఏఐపిఈయూ గ్రూప్-సి ప్రెసిడెంట్ మురళి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడ పోస్టల్ సర్కిల్ పోస్టల్ యూనియన్స్ పిలుపు మేరకు అసాధారణ టార్గెట్లతో వేధించటంపై తిరుపతి డివిజనల్ ఆఫీస్‌లో ఎస్ఎస్‌పికి మెమోరాండం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐపిఈయూ గ్రూప్-సి డివిజనల్ ప్రెసిడెంట్ వై శేషాద్రి, డివిజనల్ సెక్రటరీ జె మధన మోహన్ రెడ్డి, ఏఐజిడిఎస్ డివిజనల్ సెక్రటరీ కె నాగయ్య, శ్రీకాళహస్తి బ్రాంచ్ జిడిఎస్ సెక్రటరీ జి సత్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లల జీవన నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో కుమ్మరి మిట్ట, చింతల పాలెం, పొంగూరు గ్రామాలలో పిల్లల జీవన నైపుణ్యాలపై వారి తల్లిదండ్రులకు బుధవారం అవగాహన కల్పిం చారు. ఈ సమావేశంలో మండల కో ఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పిల్లలకి చదువుపై ఎలా ఆసక్తి పెంపొందించాలి? తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బడికి మానేయకుండా, బాల కార్మికులు లేకుండా, బాల్య వివాహాలు లేకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సమావేశానికి ప్రగతి మండల కోఆర్డినేటర్ శిరీష, సి ఓ వెంకటేష్, మురగయ్య, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్, ఏఎన్ఎంలు పా ల్గొన్నారు.

పిల్లల జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్న ప్రగతి సంస్థ ప్రతినిధులు

నేడు పశు వైద్య కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల 61వ వార్షికోత్సవం గురువారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు బుధవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జేవి రమణ, అటవీ శాఖ అధికారి డాక్టర్ డి గురుస్వామి, డీన్ డాక్టర్ కె వీర బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

మహిళా వర్సిటీలో వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సంగీత, నృత్య, లలిత కళల విభాగంలో రెండు రోజుల పాటు జరిగే వర్క్ షాప్‌లో భాగంగా మొదటి రోజు బుధవారం పద్మవిభూషణ్ , పద్మశ్రీ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఎండోమెంట్ ప్రోగ్రాంలో ప్రొఫెసర్ ఆర్ఎన్ఎస్ శైలేశ్వరి అధ్యక్షతన, ప్రొఫెసర్ సి వాణి డీన్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ముఖ్య అతిథి, ఆంధ్ర యూనివర్సిటీలో విశ్రాంత ఆచార్యులు మండపాక శారద వర్క్ షాప్ నిర్వాహకురాలు ఈ వర్క్ షాప్ బుధవారం నిర్వహించారు. ఇందులో డాక్టర్ మంగళం పల్లి బాలమురళీకృష్ణ అరుదైన రచనలను మండపాక శారద విద్యార్థినులకు నేర్పించారు. వీరు జతి స్వరం, వర్ణం , అరుదైన రాగం లవాంగి , సుచరిత్రం రాగాలలో రచనలను నేర్పించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ సి వాణి ఇలాంటి కృతులను నేర్చుకోవడం వల్ల మరుగున పడిన రచనలన్నీ బయటకు వస్తాయన్నారు. ఇవి విద్యార్థులకు మంచి సదవకాశం అని పేర్కొన్నారు. ఈ ఎండోమెంట్ దాత ఈ డాక్టర్ గుడిపాటి లలిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి- క్యాంపస్ : స్వచ్ఛత హి సేవ అభియాన్2024 లో భాగంగా ఎన్ఎస్ఎస్ బ్యూరో , మహిళా అధ్యయన విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సిటికల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా యూనివర్సిటీలో శానిటేషన్ వర్కర్స్‌కి ప్రాథమిక చికిత్సపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో చేసే ప్రథమ చికిత్స వల్ల పరిస్థితి తీవ్రం కాకుండా ఉండి ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. దీనికి కొంత నైపుణ్యం, అవగాహన అవసరమని అందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. స్విమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ విభాగం నుండి విచ్చేసిన డాక్టర్ మనోజ్ ఈ అంశంపై అవగాహన కల్పిస్తూ, శానిటేషన్ వర్కర్లు ప్రతిరోజూ ఆరోగ్యానికి హాని కలిగించే పరిస్థితులలో పని చేస్తుంటారని వారు ప్రాథమిక చికిత్స పద్ధతులపై అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని, దీని ద్వారా స్వీయ సంరక్షణతో పాటుగా, ఇతరులకు సాయం అందించే సామర్థ్యం కలిగి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గుండెపోటు, పాము , తేలు వంటి విషపురుగుల కాట్లకు గురి అయినప్పుడు తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. పాములన్నీ విషసర్పాలు కావనీ, పాము విషం కన్నా చాలా మంది షాక్ తోనే ప్రాణంమీదకి తెచ్చుకుంటారనీ, అలాంటి పరిస్థితులలో ఆలస్యం చేయక, పాముకాటుకు గురి అయిన భాగాన్ని, కుదుపులకు గురి కాకుండా చేసి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టరు నీరజ, డాక్టరు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 80 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కోటకు నేడు డాక్టర్ జయరామ్ రాక

ప్రజాశక్తి -కోట : నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ నుండి ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జయరాం గురువారం కోటకు వస్తు న్నారని జనతా క్లినిక్ డాక్టర్ జగదీష్ అన్నారు. ఈ సందర్భం గా బుధవారం డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ కోట ఎన్‌సీఆర్ నగర్ లోని జనతా క్లినిక్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు అందు బాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అపాయింట్మెంట్ వివరాలకు ఫోన్ నెంబర్ ను 99854 08000 సంప్ర దించాలని సూచించారు.

వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి - సత్యవేడు: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొ న్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ముని రవికుమార్ పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో పారిశుధ్య కార్మికులు నిబద్ధతో పని చేయాల న్నారు. అదే సమయంలో రోజువారి జీవితంలో పరిశుభ్రత ఒక భాగం కావాలన్నారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని తీసుకురావడానికి స్వచ్ఛత హీ సేవ లక్ష్యమన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు పలువురికి బిపి, షుగర్, ఇతర వ్యాధులకు సంబం ధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాసుకుప్పంలో సర్పంచ్ రవి రెడ్డి అధ్యక్షతన, సెక్రెటరీ రమణ మూర్తి పర్యవేక్షణలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు.

IN THE COURT OF THE IIIrd ADDL JUNIOR CIVIL JUDGE:: TIRUPATI
I.A.No. 215/2023
O.S.No. 896/2023
J. Pravallika, W/o. M. Hareesh Reddy
... Petitioner/ Plaintiff
Vs
J. Devi W/o. Late J. Devanand Reddy and others **... Respondents / Defendants**
NOTICE TO THE RESPONDENT NO.3
D. Chandran S/o. D. Ramana Rao Residing at D.No. 11-1-27, Gandhi Road, Tirupati, Tirupati District.
Take notice that, the suit filed for Partition Petitioner filed petition for grant temporary injunction restraining the respondents and case is posted to 27.09.2024 for your appearance you shall appear at 10:30am that day by person or through advocate failing which case will be decided in your absence.
N. Manohar M.A., B.L.,
Advocate, Tirupati

IN THE COURT OF THE IIIrd ADDL JUNIOR CIVIL JUDGE:: TIRUPATI
O.S.No. 896/2023
J. Pravallika, W/o. M. Hareesh Reddy
... Plaintiff
Vs
J. Devi W/o. Late J. Devanand Reddy and others **... Defendants**
SUIT SUMMONS TO THE DEFENDANT NO.3
D. Chandran S/o. D. Ramana Rao Residing at D.No. 11-1-27, Gandhi Road, Tirupati, Tirupati District.
Where as the plaintiff filed a suit against the defendants for partition the suit-shedule property and case is posted to 27-09-2024 for your appearance. You shall appear on that day at 10:30am either in person or through advocate failing which case will be be decided in your absence
N. Manohar M.A., B.L.,
Advocate, Tirupati

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వరపురం, కుమ్మరి వీధి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మెహబూబీ మాట్లాడుతూ పిల్లల శారీరకాభివృద్ధికి బలవర్ధకమైన పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త చాముండేశ్వరి పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: సమతుల ఆహారమే ఆరోగ్యానికి రక్ష అని పిడిఓ రామచంద్రయ్య పేర్కొన్నారు. కెవిబిపురం మండలంలోని ఎంపిడివో కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో పౌష్టిక మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రయ్య మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకున్నప్పుడే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా రక్తహీనతకు గురయ్యే ప్రమాదం తప్పుతుం దన్నా రు. ఈ నేపథ్యంలో గోధుమలు, రాగులు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాల ఆహారం తీసుకుంటే బలవర్ధకమన్నారు. అంతకు ముందు పౌష్టిక ఆహార ప్రాముఖ్యతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టిక ఆహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజరు కల్పలత, సుమతి, ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, చెంచురామిరెడ్డి, ఈశ్వరయ్య, గంగయ్య, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గర్భిణులు, బాలింతలు, పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో కసిరెడ్డి పద్మజ అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పుత్తూరు పరిధిలోని శ్రీ రంగ చెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవంలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కసిరెడ్డి పద్మజ మాట్లాడుతూ పోషకాహార ఆవశ్యకత గురించి కమ్యూనిటీకి అవగాహన కల్పించారు. బిడ్డలు తక్కువ బరువుతో పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే అన్ని సేవలు, పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండే బిడ్డకు జన్మనివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు యశోద, నీరజ, అంగన్‌వాడీ సహాయకురాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట మండలం మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా గుత్తి వారి పల్లి అంగన్‌వాడీ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సూపరువైజరు హేమావతి మాట్లాడుతూ పోషకాహార విలువలు ఉన్న వంటి ఆకు కూరలు, కూరగాయల గురించి తెలిపి మంచి ఆరోగ్యం గురించి వీటిని తప్పని సరిగా బాలింతలు, గర్భిణులు వాడాలని తెలిపారు. ప్రగతి మండల కో ఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పోషక విలువలు ఉన్న వివిధ రకాల ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది టి సురేష్, స్కూల్ టీచర్ పాల్గొన్నారు.